సామాన్యుడికి కరెంట్ షాక్

- ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచమంటూ చంద్రబాబు హామీ
- అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే వీర బాదుడు
- ట్రూ అప్ చార్జీలు, ఫ్యూయల్ పవర్ పర్చేస్, అడ్జస్ట్‌మెంట్
- ఆందోళన చెందుతున్న విద్యుత్ వినియోగదారులు
- సత్తెనపల్లి సబ్ డివిజన్ పై రూ.కోటి పైగా అదనపు భారం
- నేడు సత్తెనపల్లిలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

గత ఎన్నికల ప్రచారంలో ఐదేళ్లపాటు విద్యుత్ చార్జీలు పెంచమని పదేపదే హామీ ఇచ్చిన చంద్రబాబు అప్పుడే ప్రజలపై కక్షపూరిత చర్యలకు దిగాడు. ఆయన మోసపూరిత మాటలు నమ్మి ఓట్లేసిన ప్రజలకు ఇప్పుడు కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల రూపంలో షాక్ ఇస్తోంది. ఆరు నెలలకే విద్యుత్ భారం మోయలేమంటూ రాష్ట్ర ప్రజలపై ఏకంగా రూ.15 వేల కోట్లు భారం వేసేందుకు సిద్ధమైంది. అందులో భాగంగా సత్తెనపల్లి సబ్‌డివిజన్‌పై రూ.కోటికి పైగా ప్రజలు నడ్డి విరిచేలా కరెంటు బిల్లులు షాక్ కొడుతున్నాయి.


పట్టణంలో సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న చిట్టా విజయ భాస్కర రెడ్డి

సత్తెనపల్లి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సామాన్యులకు విద్యుత్ బిల్లులతో షాక్ తగిలేలా చేసింది. ఈ ప్రభుత్వంలో ఇప్పటికే నిత్యావసరాల అమాంతం పెరగడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇదే సమయంలో విద్యుత్ బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యు త్ చార్జీలు పెంచమని కూటమి గత ఎన్నికల ప్రచారంలో హామీలు గుప్పించింది. తీరా అధికారంలోకి వచ్చాక విద్యుత్ ఛార్జీలను గతంలో ఎన్నడూ లేని విధంగా పెంచేశారు. సత్తెనపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని సత్తెనపల్లిటౌన్, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ల, క్రోసూరు, అచ్చంపేట మండలాల వ్యాప్తంగా భారీగా పెరిగిన విద్యుత్ బిల్లులను చూసిన సామాన్యులు షాక్‌కు గురవ్వాల్సిన పరిస్థితి. అధిక సంఖ్యలో పెరిగిన విద్యుత్ బిల్లులను ఎలా చెల్లించాలో తెలియక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పెరిగిన విద్యు త్ బిల్లులను సకాలంలో చెల్లించలేక ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో ఇంత జరుగుతున్నప్పటికీ టీడీపీ కూటమి ప్రభుత్వ మేమో తమకేమీ పట్టనట్లు మిన్నకుండిపోతుంది.

ప్రజలపై విద్యుత్ కొనుగోలు భారం...

విద్యుత్ కొనుగోలు భాగాన్ని ప్రజలపై రుద్దాలని నిర్ణయించుకుని గద్దెనెక్కిన ఆరు నెలల్లోనే రెండుసార్లు చార్జీల పెంపుతో ప్రజలపై ప్రభుత్వం భారం మోపుతుంది. నిజానికి ప్రభుత్వమే ఈ భారాన్ని భరిస్తే విద్యుత్ చార్జీల పెంపు జరిగే అవకాశం ఉండేది కాదు. అయితే ఈ సర్దుబాటు భారాన్ని తాము మోయలేమంటూ కూటమి సర్కార్ చేతులెత్తేయడంతో విద్యుత్ చార్జీల పెంపు షాక్ రాష్ట్ర ప్రజలకు తప్పడం లేదు. దీంతో విద్యుత్ వినియోగదారుల్లో ఒకింత ఆందోళన నెలకొంది.

సత్తెనపల్లి సబ్ డివిజన్ సర్వీసులు..

సత్తెనపల్లి సబ్ డివిజన్ వ్యాప్తంగా అన్ని విద్యుత్ సర్వీసులు 1,19,500 ఉన్నాయి. వీటిలో గృహ విద్యుత్ సర్వీసులు 98,500, వ్యవసాయ విద్యుత్ సర్వీసులు 9,600, వాణిజ్య విద్యుత్ సర్వీసులు 10,200, ఇండస్ట్రియల్ సర్వీసులు 1,200 ఉన్నాయి. ఇంధన సర్దుబాటు చార్జీల రూపంలో రూ. కోటి పైగా అదనపు బాదుడు వేస్తున్నారు. ఏప్రిల్ 2022 –మార్చి 23 వరకు వాడిన యూనిట్లు సర్దుబాటు చార్జీలను ప్రతినెల 0.60–0.83 పైసలు చొప్పున బిల్లుల్లో సర్దుబాటు చేస్తున్నారు. ఈ భారాన్ని నవంబర్ 2024–2026వ సంవత్సరం జనవరి వరకు వినియోగదారుల నుంచి వసూలు చేయడానికి కూటమి సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. ఈ అదనపు భారం గృహ, వాణిజ్య సర్వీసులపై ప్రభావం చూపనుంది. దాదాపు ప్రతి సర్వీసుకు రూ. 30 నుంచి రూ.500 వరకు అదనంగా వస్తోంది.

నేడు విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ నిరసన

ఇంధన సర్దుబాటు చార్జీల అంశంపై వినియోగదారులు, ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు చిట్టా విజయభాస్కర్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలతో అధికాకారంలోకి వచ్చిన చంద్రబాబు తన మార్కు నయవంచనతో తాను ఇచ్చిన హామీలకు తూట్లు పొడుస్తూ మరోసారి ప్రజల నడ్డి విరిచారన్నారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని, ట్రూఆప్ చార్జీలు కూడా ఎత్తేస్తామని నాడు ఎన్నికల ముందు హామీ ఇచ్చి తాను ఏ హామీ ఇవ్వలేదంటూ ఇప్పుడు నిసిగ్గుగా చంద్రబాబు బుకాయిస్తున్నాడన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద నుంచి గుంటూరు రోడ్ లోని విద్యుత్ ఏడీఈ కార్యాలయం వరకు శుక్రవారం ఉదయం 10 గంటలకు నిరసన ప్రదర్శన చేపట్టి వినతిపత్రం అందించడం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, పార్టీ నాయకులు పెద్దింటి వెంకటేశ్వర్లు (చిట్టి), గుజ్జర్లపూడి సతీష్, గడ్డం వెంకటేశ్వర్లు (బుల్లోడు), వల్లెం నరసింహారావు, యాసారపు బాబు, ఉల్లంగుల ప్రసాద్ బాబు, మందడపు సాయి ఉన్నారు.

క్లుప్తంగా

నేడు కరెంటు చార్జీలు బాదుడుపై నిరసన

పెదకూరపాడు: కరెంట్ చార్జీల బాదుడుకు నిరసనగా శుక్రవారం ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదకూరపాడు సినిమా హాల్ సెంటర్ నుంచి ర్యాలీగా వెళ్లి విద్యుత్ ఏఈకి వినతిపత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

బీమా ప్రీమియం చెల్లించాలి

నకరికల్లు: రబీలో సాగు చేస్తున్న పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కోసం ఎకరాకు రూ.630 చొప్పున ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు రైతులు సూచించారు. మండలంలోని గుండ్లపల్లి, బాలాజీనగర్‌తండా గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎం.ప్రశాంత్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఎం.సంధ్యారాణి, వీఆర్వో షేక్ సైదా, ఇన్సూరెన్స్ సంస్థ క్లస్టర్ ఇన్‌చార్జి గోపి పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



అచ్చంపేట: క్రిస్మస్ వేడుకలలో భాగంగా మండలంలోని తాళ్లచెరువు గ్రామంలో నక్షత్రం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు ఫాదర్ రేపూడి రాయప్ప ఆధ్వర్యంలో 250 మంది నిరుపేద వృద్ధులు, వితంతవులు, వికలాంగులకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ రేపూడి రాయప్ప మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకోవడం తృప్తినిస్తోందన్నారు. కార్యక్రమంలో రేపూడి జయపాల్, విజయలక్ష్మి, గుజరాత్‌లోని రాజ్కోట్ జిల్లా అడిషనల్ ఎస్పీ రేపూడి నవీన్‌చక్రవర్తి, డాక్టర్ ప్రణయదీపిక, ప్రవాసాంధ్రులు రేపూడి వినయ్‌సావంత్, సింధియా, ప్రాన్సిస్, శాంతమ్మ పాల్గొన్నారు.

విద్యారత్న' జాతీయ పురస్కారానికి శ్రీనివాస రెడ్డి ఎంపిక



పెదకూరపాడు: మండలంలోని 75 తాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అన్నపురెడ్డి శ్రీనివాస్ రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. పుడమి సాహితీ వేదిక తెలంగాణ, మానవ హక్కుల ప్రజా పరిరక్షణ కమిటీ ఖమ్మం ఆధ్వర్యంలో విద్యారత్న జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. శ్రీనివాస్ రెడ్డి గత కొన్ని సంవత్సరాలుగా విద్యారంగంలో ప్రధానోపాధ్యాయులుగా, వ్యాసకర్తగా కృషి చేస్తున్నారు. ఈనెల 29న ఖమ్మం పట్టణంలో భారతీయ లలిత కళా ఉత్సవ్ సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమంలో ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డిని హెచ్ఎం అసోసియేషన్ అధ్యక్షులు ఎ.తిరుమలేష్, ఆర్.శ్రీనివాస రెడ్డి, పీసీ చైర్మన్ పున్నారావు అభినందించారు.

ఘనంగా సీపీఐ శత దినోత్సవం



సత్తెనపల్లి: భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల వార్షికోత్సవాన్ని పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ కార్యదర్శి పి.యిర్మియ, పార్టీ జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సేవలను గుర్తు చేశారు. పార్టీ సహాయ కార్యదర్శి, వల్లెం లక్ష్మీ చెన్నకేశవరావు మాట్లాడుతూ ప్రజా పోరాటాలు నిర్వహించిన బ్రిటిష్ పాలకులు అనేక ఇబ్బందులు పెట్టినట్లు చెప్పారు. ఏఐటీయుసీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ మాట్లాడుతూ వామపక్షాలన్నీ ఒకే వేదిక మీదకి రావడానికి సీపీఐ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్. వేణుగోపాల్, తిరుపతిరావు, నరసింహారావు పాల్గొన్నారు.

కార్మికులకు వెన్ను దన్నుగా సీపీఐ

పెదకూరపాడు: మండల పరిధిలోని 75 తాళ్లూరు గ్రామంలో సీపీఐ కార్యాలయంలో శత వార్షికోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికులకు, కర్షకులకు వెన్నుదన్నుగా సీపీఐ నిలబడుతుందని చెప్పారు. శత జయంతి సందర్భంగా సీపీఐ సీనియర్ నేత చల్లపల్లి పానయ్య జెండా ఆవిష్కరించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ భవిష్యత్తులో భారత కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఎంత అయిందని చెప్పారు. నండూరి రాజు, పోతుల సామేలు, కంచర్ల పున్నయ్య, దొడ్డ రాజు, జండుబాల కోటేశ్వర రావు, ఇశ్రాయేలు, ఎస్ కే బాషా పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

పాలువాయి జంక్షన్(రెంటచింతల): మండల పరిధిలోని పాలువాయి జంక్షన్ వద్ద నున్న షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం అర్చకులు గోపాల్ పాండే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు సాయినాథునికి పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. భజన బృందం బాబా గీతాలను ఆలపించగా భక్తులు తన్మయం చెందారు. భక్తులకు అన్న సంతర్పణం చేశారు. దేవస్థానం చైర్మన్ పందిరి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకోవాలి

ఏడీఏ హనుమంతరావు


మాట్లాడుతున్న ఏడీఏ హనుమంతరావు, ఏఓ వేణుగోపాల్

క్రోసూరు: రైతు సేవా కేంద్రాల ద్వారా వరి కనీస మద్దతు ధర రూ.1,740కు కొనుగోలు చేస్తున్నట్లు ఏడీఏ హనుమంతరావు తెలిపారు. మండలంలోని క్రోసూరు, అందుకూరులో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలలో వరి 75 కిలోల బస్తా కనీస మద్దతు ధర రూ.1740 చొప్పున కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. దీనికి రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ధాన్యం విక్రయించుకునే రైతులకు పలు సూచనలు చేయటం జరిగింది. ఈ–పంట నమోదు చేసుకొని ఈ–కేవైసీ కూడా పూర్తి అయిన రైతులు తమ ధాన్యాన్ని రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి అమ్ముకొనవచ్చునన్నారు. రైతులు ముందుగా ఒక కిలో ధాన్యాన్ని రైతు సేవా కేంద్ర కేంద్రానికి తీసుకువెళ్లి, అందులో తేమ.ఇతర నాణ్యత ప్రమాణాలను రైతు సేవా కేంద్ర సిబ్బంది ద్వారా పరీక్ష చేయించుకోవాలన్నారు. ధాన్యంలో తేమశాతం 17 కన్నా మించి ఉన్నట్లయితే, రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని 17 శాతం కన్నా తక్కువ వచ్చిన తర్వాత తిరిగి తీసుకు రావాలన్నారు. రైతులు గోనె సంచులు, హమాలీలు ఖర్చు, రవాణా వారి సొంతంగా ఏర్పాటు చేసుకుంటే, ప్రభుత్వ లెక్కల ప్రకారం అనగా 40 కిలోల ఒక గోనె సంచికి ఒకటికి రూ.3.39 క్వింటాలుకు హమాలీ చార్జీ రూ.17.17 ,రవాణా చార్జీలు స్థానికంగా నిర్ణయించిన రేట్ల ప్రకారం ధాన్యం సొమ్ముతో కలిపి ఆధార్ నెంబర్‌కు అనుసంధానిత రైతు ఖాతాలోకి నేరుగా చెల్లించడం జరుగుతుందన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దారుకు వినపతి పత్రం ఇస్తున్న మాజీ సర్పంచి శ్రీనివాసరెడ్డి


రెంటపాళ్లలో తహసీల్దార్ కేఎస్ చక్రవర్తికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సత్తెనపల్లి: రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని సీపీఎం సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ అన్నారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పెండ్యాల మహేష్ మాట్లాడుతూ సమగ్ర భూ సర్వే చేసి సంవత్సరాలు కావస్తున్నా రైతుల భూ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. రైతులు ఆన్‌లైన్ సమస్యలు, భూమి సరిహద్దులు, భూమి హెచ్చు తగ్గులను పరిష్కరించలేదని, తక్షణమే అధికారులు సర్వే చేసిన భూములపై క్షేత్ర స్థాయి పరిశీలన చేసి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. గ్రామంలో ఉన్న సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కేఎస్ చక్రవర్తికి అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొల్లెపల్లి రామారావు, మక్కపాటి శివరాం , దుగ్గి తాతారావు పాల్గొన్నారు.

అగ్రహారం భూములకు పాస్ పుస్తకాలివ్వండి

అచ్చంపేట: తరతరాలుగా సేద్యం చేసుకుంటున్న భూములను ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోగంటివారిపాలెం గ్రామస్తులు విన్నవించారు. మండలంలోని కోగంటివారిపాలెంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామస్తుల తరఫున మాజీ సర్పంచి సుంకర శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ జి.శ్రీనివాసయాదవ్‌కు వినతి పత్రం అందజేశారు. తమ గ్రామంలో మొత్తం 1355 ఎకరాల అగ్రహారం భూములున్నాయని, అందులో 800 ఎకరాలను రైతులు సేద్యం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా భూములను అనుభవిస్తున్నా ఆ భూములు ఆన్‌లైన్ చేయకపోవడం, పాస్ పుస్తకాలు ఇవ్వకపోవడంతో తమకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు రావడం లేదని, బ్యాంకులలో అప్పులు పుట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దారు విషయాన్ని ఉన్నతాధికారులదృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

రాజుపాలెం పోలీస్ స్టేషన్ తనిఖీ


పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ హనుమంతరావు

రాజుపాలెం: శాంతిభద్రతల విషయంలో ఎవ్వరిని ఉపేక్షించేది లేదని డీఎస్పీ ఎం.హనుమంతరావు పేర్కొన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో వార్షిక తనిఖీలు గురువారం నిర్వహించారు. ఈ సంవత్సరానికి సంబంధించిన రికార్డులను, పెండింగ్ కేసుల రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచనలను అందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ప్రతి ఒక్కరితో స్నేహభావం కలిగి ఉంటారని, అలాగని తప్పులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. స్టేషన్ పపరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట సత్తెనపల్లి రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు, ఎస్ఐ వేణుగోపాల్ ఉన్నారు.

మోహన్ రంగా ఆశయ సాధనకు కృషి చేయాలి

- వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్
- వాడవాడలా దివంగత రంగా వర్ధంతి కార్యక్రమాలు


పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రంగా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం


మల్లాదిలో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సత్తెనపల్లి: బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం తన ప్రాణాన్ని సైతం త్యాగం చేసిన వ్యక్తి దివంగత శాసనసభ్యుడు వంగవీటి మోహన్‌రంగా అని, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు వల్లెం నరసింహరావు ఆధ్వర్యంలో రంగా వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వంగవీటి మోహన్‌రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, నాయకులు పెద్దింటి వెంకటేశ్వర్లు (చిట్టి),గుజ్జర్లపూడి.సతీష్, తోట.లక్ష్మీనారాయణ, గడ్డం.వెంకటే శ్వర్లు(బుల్లోడు), వల్లెం. నరసింహారావులు మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గంటా.ఏసుబాబు,గొల్లపల్లి.రాము,గొల్లపల్లి.నాగేశ్వరరావు, రియాజ్, నితిన్ చౌదరి, మందడపు సాయి పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో....

పేదల మనిషి దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహన్‌రంగా అని జనసేన నియోజకవర్గ బాధ్యుడు బొర్రా వెంకట అప్పారావు అన్నారు. వర్ధంతిని పురస్కరించుకుని ఆదరణ వృద్ధాశ్రమం, మొల్లమాంబ వృద్ధాశ్రమంలో అన్నసంతర్పణ నిర్వహించారు. దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహన్‌రంగా వర్ధంతి గురువారం పట్టణంలోని వడ్డవల్లి పోలేరమ్మ గుడి వద్ద, రఘురామ్ నగర్ లోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ నేతలు నిర్వహించారు. మోహన్‌రంగా విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అమరావతి:దివంగత వంగవీటి మోహనరంగా యువతకు ఆదర్శమని క్రోసూరు మార్కెట్ మాజీ చైర్మన్ వెంపా జ్వాలాలక్ష్మీనరసింహారావు అన్నారు. గురువారం మండల పరిధిలోని మల్లాది గ్రామంలో వంగవీటి వర్ధంతి నిర్వహించారు. తొలుత వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, నాయకులు వెంపా వాసు, వెంపా శ్రీను పాల్గొన్నారు.

అమరావతిలో..

స్థానిక పోస్టాఫీస్ సెంటర్‌లోని వంగవీటి మోహనరంగా వర్ధంతి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, నాయకులు షేక్ హష్మీ, శివరామకృష్ణ, వెంపా వాసు, నాగుల్‌జానీ పాల్గొన్నారు.

రంగా ధైర్యాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

బెల్లంకొండ: కుల, మతాలకు అతీతంగా పేదల వర్గాల కోసం పోరాటం చేసిన వంగవీటి మోహన రంగా ధైర్య సాహసాలను ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కాపు సంఘం మండల అధ్యక్షుడు ఆసుల జగన్ తెలిపారు. గురువారం మండలంలోని అన్నీ గ్రామాలలో వంగవీటి రంగా వర్ధంతి అభిమానులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని గంగిరెడ్డిపాలెం, వెంకటాయపాలెం, పాపాయపాలెం, బెల్లంకొండ, నందిరాజుపాలెం గ్రామాలలో వర్ధంతి సందర్భంగా భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆయన విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అచ్చంపేటలో..

అచ్చంపేట: దివంగత ఎమ్మెల్యే మోహన రంగా వర్ధంతిని కాపు సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆంజనేయస్వామి విగ్రహం వద్ద గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో కాపు నాయకులు అన్నం శ్రీనివాసరావు, అచ్చంపేట సర్పంచి కంబాల వీరబాబు, మాదిపాడు మాజీ సర్పంచి వి.వెంకటేశ్వరరావు, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, చెంచయ్య, సత్యం, గోపి, ఆంజనేయులు, ప్రసాద్, టి.ఆంజనేయులు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిరండి

అమరావతి: పెదకూరపాడులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న విద్యుత్‌చార్జీల పెంపునకు నిరసనగా పోరుబాట కార్యక్రమానికి కార్యకర్తలు, నాయకులు తరలి రావాలని వైఎ స్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 9గంటలకు పెదకూరపాడు సినిమాహాల్ సెంటర్ నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు వెళ్లి అక్కడ నిర్వహించే ధర్నాకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అచ్చంపేటలో..

అచ్చంపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గణనీయంగా పెరిగిన విద్యుత్ చార్జీలకు నిరసనగా నిరుపేదలకు అండగా నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో శుక్రవారం నిర్వహించనున్న పోరుబాట కార్యక్రమానికి తరలి రావాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, విద్యుత్ వినియోగదారులు తరలి వచ్చి పోరుబాటకు మద్దతు పలకాలని పేర్కొన్నారు.

బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌కు మరమ్మతులు



బెల్లంకొండ: మండల పరిధిలోని బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్ కాలువపై మరమ్మతులు ప్రారంభించినట్లు ఎస్ఎస్పీ జేఈ ఇబ్రహీం తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ బ్రాంచ్ కాలువపై నడవడానికి కూడా వీలు లేకుండా ఉండడంతో బెల్లంకొండ డీసీ–7 చైర్మన్ అంచుల శివలక్ష్మి, మాజీ చైర్మన్ అంచుల బాలసైదులు సొంత నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. బెల్లంకొండ, రాజుపాలెం మండలాల పరిధిలోని కాలువపై, దమ్ము ట్రాక్టర్ల సహాయంతో ముళ్ల చెట్లు తొలగించుట, కాలువలో నాచు తొలగించే పనులు చేపట్టారు.


వరి పనలపై ఉప్పు ద్రావణం చల్లుకోవాలి



మాచవరం: వర్షాలకు తడిచిన వరి పనలను తిరగవేసి ఆరబెట్టుకోవాలని, మొలకలు వచ్చేట్లు ఉంటే 5 శాతం ఉప్పు ద్రావణం పనలపై పిచికారి చేయాలని ఏఓ కె.రామమ్మ తెలిపారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పంట నమోదు చేసుకున్న రైతులు ధాన్యం అమ్ముకోవాలంటే గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వ్యవసాయ సమాయకులు అన్వర్‌బాషా, రైతులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీవారికి ధనుర్మాస పూజలు


వడ్డవల్లిలో నిజరూప దర్శనంలో శ్రీవారు


రైల్వేస్టేషన్ రోడ్డులో నిఖిల లోకేశ అలంకారంలో శ్రీవారు

సత్తెనపల్లి: ధనుర్మాస ఏకాదశిని పురస్కరించుకొని పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయాల్లో కనుల పండువగా శ్రీవారికి పూజలు నిర్వహించారు. పట్టణంలోని వడ్డవల్లి శ్రీ రామాలయం శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో తిరుమలలో స్వామి వారి కైంకర్య ఆచారాన్ని అనుసరించి శ్రీవారికి నిజరూప దర్శనాన్ని భక్తులు గురువారం ఏర్పాటు చేశారు. అలాగే రైల్వే స్టేషన్ రోడ్‌లోని అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నిఖిల లోకేశ అలంకారం శ్రీవారికి నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేత


విన్నర్స్‌గా నిలిచిన క్రీడాకారులతో పోటీల నిర్వాహకులు

అచ్చంపేట: క్రిస్మస్ ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని తాళ్లచెరువు బాలఏసు దేవాలయ ప్రాంగణంలోని నిర్వహించిన వివిధ రకాల ఆటల పోటీల విజేతలకు గురువారం విచారణకర్తలు గురుశ్రీ పుట్టి అంతోని రాజు, సహాయక విచారణ కర్తలు గురుశ్రీస్యామ్ బహుమతులను పంపిణీ చేశారు. షటిల్, వాలీబాల్, మ్యూజికల్ చైర్స్, పాసింగ్ బాల్, హిట్టింగ్ బాల్, ఇన్‌డిబాస్కట్, బెలూన్‌బ్లాస్టింగ్, బాంబే బ్లాస్టింగ్ వంటి వివిధ రకాలైన ఆటల పోటీలు మహిళలకు, పురుషులకు వేర్వేరుగా నిర్వహించారు. వాలీబాల్ పోటీలలో రాజా అండ్ టీం విన్నర్స్‌గా, రాజీవ్ సెవెన్ స్టార్స్ రన్నర్స్‌గా నిలచారు. విజేతలకు వినోద్‌రెడ్డి జ్ఞాపకార్థం జగదీష్‌రెడ్డి బహుమతులు షీల్డ్ పంపిణీ చేశారు. పోటీలను ఏరువ బాలశౌరెడ్డి, అల్లంబాలశౌరెడ్డి, బత్తుల సురేష్‌రెడ్డి, గుంజి బాలశౌరెడ్డి, వడ్డవల్లి కిరణ్, వెన్నా అర్లారెడ్డి, సంధ్య తదితరులు పోటీలను నిర్వహించారు.